Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 332 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 13 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టాం : ఎయిర్ మార్షల్ ఎ.కె. భార్తీ




**న్యూఢిల్లీ :** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారత్ చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైందని ఎయిర్ మార్షల్ ఎ.కె. భార్తీ వెల్లడించారు. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా దాడులు చేశామన్నారు. పాక్‌లో సామాన్య పౌరులకు ఎటువంటి నష్టం జరగలేదని తెలిపారు. పాక్ వైపు నుంచి దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టామన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పలువురు ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆ క్రమంలో ఎయిర్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ ఎయిర్ మార్షల్ ఎ.కె.భార్తీ మాట్లాడుతూ.. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశామని ఆయన పేర్కొన్నారు. దాయాది దేశంలో జరిగిన నష్టానికి పాకిస్థాన్ ఆర్మీదే బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థతో పాక్ క్షిపణులు, డ్రోన్లను తిప్పికొట్టామని చెప్పారు. చైనా తయారు చేసిన పీఎల్ 15 క్షిపణిని నేలకూల్చామన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో స్వదేశీ తయారీ ఆకాశ్‌ను సమర్థంగా వినియోగించామని ఎ.కె.భార్తీ వెల్లడించారు. మన కౌంటర్ సిస్టం టర్కీ డ్రోన్లనే కాదు.. దేనినైనా పడగొట్టగలమన్నారు. దేశీయ పరిజ్ఞానం గొప్పగా ఉందని తెలిపారు. జైష్, లష్కరే నేతల పేర్లతో గందరగోళం సృష్టించేందుకు పాక్ ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. తమ పోరాటం ఉగ్రవాదులతోనే కానీ.. పాకిస్థాన్‌తో కాదని ఆయన తేల్చి చెప్పారు. అయితే ఉగ్రవాదులు కొన్నాళ్లుగా తమ వ్యూహాలను మార్చుకుంటున్నారన్నారు. ఈ యుద్ధంలో ఏయే ఆయుధాలు ఉపయోగించామో వెల్లడించలేమని ఆయన పేర్కొన్నారు. ఇదొక వినూత్నమైన యుద్ధమన్నారు. గతంలోలాగా ఉండదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిపోయిందని చెప్పారు. తమ పోరాటం తీవ్రవాదుల మౌలిక సదుపాయాలపై దాడులు చేయడంపై మాత్రమేనని స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు పాకిస్తాన్ ఆర్మీ మద్దతుగా నిలబడుతోందని గుర్తు చేశారు. సరిహద్దుల వద్ద భారత వాయిసేన.. తన ఆయుధ సంపత్తితో ఎదుర్కొందని వివరించారు. ఉగ్రవాదులకు అండగా నిలిచినందుకు.. భారత వాయుసేన ఆగ్రహాన్ని పాకిస్థాన్ చవి చూడాల్సి వచ్చిందన్నారు. దేశీయంగా తయారైన గగనతల రక్షణ వ్యవస్థ పాకిస్తాన్ పంపిన డ్రోన్లను కూల్చి వేసిందని చెప్పారు. శత్రు దేశానికి సంబంధించిన దాడులు అడ్డుకోవడంలో భారత వాయిసేన సమర్థవంతంగా వ్యవహరించిందని ఆయన స్పష్టం చేశారు. పాకిస్తాన్ ప్రయోగించిన దీర్ఘ శ్రేణి క్షిపణులకు సంబంధించిన కూల్చివేసిన శకలాలను తాము దేశ ప్రజలకు చూపిస్తున్నాన్నారు. పాకిస్తాన్‌లో జరిగిన దాడులకు ఆ దేశ ఆర్మీ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పాకిస్తాన్‌లో భారత్ జరిపిన దాడులకు సంబంధించిన ఆధారాలను దేశ ప్రజల ముందు ఉంచుతున్నామని తెలిపారు. లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ మాట్లాడుతూ.. అమాయక ప్రజలపై పాక్ దాడులకు తెగబడిందని మండిపడ్డారు. పహల్గామ్‌లో అమాయక పర్యాటకులను చంపారని ఆయన గుర్తు చేశారు. అయితే తాము ముందే ఎయిర్ డిఫెన్స్ సిస్టం సిద్ధం చేశామన్నారు. మన ఎయిర్ డిఫెన్స్ బలమైన గోడలా నిలిచిందని చెప్పారు. బహుళ ఆయుధ వ్యవస్థను అధిగమించే శక్తి పాక్‌కు లేదన్నారు. పహల్గామ్ పాపానికి మూల్యం చెల్లించారంటూ పాకిస్థాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత సైనిక స్థావరాలపై దాడి చేయడం అసాధ్యమని లెఫ్టినెంట్ గవర్నర్ రాజీవ్ వెల్లడించారు. అలాగే వైస్ అడ్మిరల్ ప్రమోద్ మాట్లాడుతూ.. నౌకాదళం పటిష్ట నిఘాతో దాడులను తిప్పికొట్టిందని చెప్పారు. గగనతల దాడులను తక్షణమే పసిగట్టి వాటిని నిలువరించామని ఆయన స్పష్టం చేశారు. ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్లు, రాడర్లు సైతం వినియోగించామని చెప్పారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని పేర్కొన్నారు. డ్రోన్లు, హైస్పీడ్ మిస్సైల్స్, హెలికాప్టర్లను సైతం వినియోగించామని గుర్తు చేశారు. నౌకదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగామన్నారు. మిగ్‌లు, హెలికాప్టర్ల ద్వారా పాక్ దాడులను గుర్తించగలిమని వైస్ అడ్మిరల్ ప్రమోద్ వివరించారు.

## నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివి

### - ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్





**విజయవాడ, (రాజధాని వార్తలు):** నిస్వార్థంగా నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో పవన్ సమావేశమయ్యారు. వారిని ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ఎంతోమంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరిచిపోరని ఆయన ప్రశంసించారు.

**ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సుల కృషి..**

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. నర్సుల వృత్తికి గౌరవాన్ని, ఖ్యాతిని తెచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సుల కృషి, సేవ అమోఘమని కొనియాడారు. పేషంట్లను సొంత మనిషిలా చూసుకుంటూ.. అవసరమైన చికిత్సలో ఆసరాగా నిలుస్తున్న నర్సులు.. చిరునవ్వుతో, మానవత్వంతో సేవలందించే ప్రతి నర్సుకీ హృదయపూర్వక వందనాలు అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కాగా ఆపరేషన్ సిందూర్‌లో అవసరమైతే తమ వంతు పాత్ర పోషిస్తామని తెలంగాణ ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లు స్పష్టం చేశారు. పాకిస్థాన్‌కు దీటుగా బదులిస్తున్న మన సైన్యానికి వైద్య సేవలందించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లు ప్రతిజ్ఞ చేశారు. శనివారం సాయంత్రం కోఠిలోని వైద్య విద్య సంచాలకుల కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్సులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఎటువంటి పరిస్థితుల్లోనైనా సేవలందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాగా, అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రవీంద్ర భారతిలో తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ నర్సెస్ డే వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో వైద్య మంత్రితో పాటు, ఆరోగ్య శాఖ కార్యదర్శి, డీఎంఈ, డీహెచ్, టీవీవీపీ కమిషనర్, టీఎన్‌జీవో ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షురాలు ఆది లక్ష్మి తెలిపారు.

## కోటప్పకొండ గిరిప్రదక్షిణలో అపశృతి

**పల్నాడు జిల్లా, (రాజధాని వార్తలు):** పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మండలంలో గల ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం కోటప్పకొండకు భక్తులు చాలామంది వస్తుంటారు. ఇక్కడ కొలువైన త్రికోటేశ్వర స్వామికి భక్తులు విశేష పూజలు చేస్తుంటారు. ఏదైనా కోరిక కోరుకుంటే స్వామివారు త్వరగా తీరుస్తారని భక్తుల విశ్వాసం. ఇవాళ(సోమవారం) వేల సంఖ్యలో భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రతి పౌర్ణమికి కోటప్పకొండ గిరి ప్రదక్షిణ జరుగుతుందన్న విషయం తెలిసిందే. గిరి ప్రదక్షిణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి నేపథ్యంలో భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని అధికారులు సౌకర్యాలు కల్పించారు. గిరిప్రదక్షిణలో పాల్గొనడానికి భక్తులు భారీగా కొండకు చేరుకున్నారు. ఈ సమయంలో గిరిప్రదక్షిణలో అపశృతి చోటు చేసుకుంది. గిరిప్రదక్షిణ చేస్తూ ఓ భక్తుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆ వ్యక్తి కళ్లు తిరిగి కిందపడటంతో పక్కనున్న భక్తులు గమనించి వెంటనే రోడ్డు పైకి తీసుకు వచ్చేసరికే ప్రసాద్ (50) మృతి చెందాడు. మృతుడు ప్రసాద్ చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం వాసిగా గుర్తించారు. ప్రసాద్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తరలించడానికి ఏర్పాట్లు చేశారు.



**ఎన్టీఆర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం**

మరోవైపు.. ఎన్టీఆర్ జిల్లాలోని ఏ.కొండూరు జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు, కూరగాయల వాహనం ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్నాయి. వల్లంపట్లలో ఒక శుభకార్యంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో కొండపల్లికి కారులో కుటుంబ సభ్యులు వెళ్తున్నారు. ఈ ప్రమాదంలో తిరుమలకొండ సుచిత్ర (6) తీవ్ర గాయాలతో మృతి చెందగా, మిగతా కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలయ్యాయి. అత్యవసర చికిత్స కోసం క్షతగాత్రులను విజయవాడకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యుత్ చార్జీలపై మంత్రి గొట్టిపాటి కీలక ప్రకటన



**ప్రకాశం, (రాజధాని వార్తలు):** విద్యుత్ చార్జీలు పెంచలేదు, పెంచబోమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని తెలిపారు. యాక్సిస్ గ్రూప్ ఫీల్డ్ ఎనర్జీ మీద వైసీపీ నేతలు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం మీద వైసీపీ నేతలు పదే పదే బురదజల్లే పనులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ (సోమవారం) ప్రకాశం జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పులు సరిదిద్దడానికే తమకు టైం సరిపోతుందని చెప్పారు. విద్యుత్ శాఖను జగన్ దుర్వినియోగం చేశారని ఆరోపించారు. యాక్సిస్ ఎనర్జీకి రూ. 5.12లకు జగన్మోహన్ రెడ్డి ఒప్పందం చేసుకున్నారని... తమ ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకుని రూ. 4.60లకు పీక్ అవర్స్‌లో కూడా విద్యుత్ సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నామని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం విద్యుత్ శాఖను తమ ఆదాయ వనరుగా మార్చుకుందని విమర్శలు చేశారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాయలసీమ, ప్రకాశం జిల్లా ప్రాంతాల్లో రెన్యువబుల్ ఎనర్జీకి పెద్దపీట వేశామని ఉద్ఘాటించారు. రెన్యువబుల్ ఎనర్జీలో దేశంలో రాయలసీమ ప్రాంతం అనుకూలమని చెప్పారు. తప్పుచేసిన వారికి రెడ్‌బుక్ వర్తిస్తుందని హెచ్చరించారు. అవసరం లేకుండా ఈ ప్రభుత్వం ఎవరిని ఇబ్బంది పెట్టదని స్పష్టం చేశారు. గతంలో తప్పులు చేసిన వారికే రెడ్‌బుక్ వర్తిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు.

## హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** నానక్ రామ్ గూడలో సొనాటా సాఫ్ట్ వేర్ సంస్థ నూతన ఫెసిలిటీ సెంటర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ నూతన ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించుకున్న సందర్భంగా యాజమాన్యం, ఉద్యోగులు అందరికీ శుభాభినందనలు తెలిపారు. సొనాటా సాఫ్ట్‌వేర్ అత్యాధునిక AIని ఉపయోగించి పర్యావరణ వ్యవస్థలను రూపొందించడం గర్వకారణమన్నారు.

**నెంబర్ 1 రాష్ట్రంగా...**

హైదరాబాద్ మహానగరం సాఫ్ట్‌వేర్ రంగంలో, లైఫ్ సైన్సెస్ రంగంలో ఇంకా అనేక రంగాల్లో జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్) కు హబ్‌గా మారిందని, అలాగే AI-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు కేంద్రంగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.




మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, HCL టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలు తమ క్యాంపస్‌లను విస్తరిస్తున్నాయని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పనిచేస్తూనే పరిశ్రమలకు మద్దతు ఇస్తూ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తోందన్నారు. డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రానికి కొత్తగా రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు, 1 లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించామని 2025లో దావోస్‌లో తెలంగాణ రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టి నంబర్ 1 రాష్ట్రంగా నిలిచిందని చెప్పారు. దేశీయంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో ఉందన్నారు.

**హైదరాబాద్ ట్రాఫిక్ ఫోర్స్‌లో ట్రాన్స్‌జెండర్స్..**

తెలంగాణ రాష్ట్రం పోలీసింగ్, శాంతి భద్రతలు, ద్రవ్యోల్బణ నిర్వహణ, ఉద్యోగ సృష్టి, పన్ను వసూళ్లలో నంబర్ వన్‌గా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 66 లక్షల మంది మహిళలకు స్వయం సహాయక బృందాల ద్వారా సాధికారత, రాజీవ్ యువ వికాసం ద్వారా యువత వ్యాపారాలు, స్వయం ఉపాధికి అవసరమైన నిధులు ప్రభుత్వం అందిస్తోందన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ ఫోర్స్‌లో ట్రాన్స్‌జెండర్స్, స్వచ్ఛంద సేవకులను నియమించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. డ్రై పోర్టు నిర్మాణం, ఆంధ్రప్రదేశ్ సముద్ర ఓడరేవుతో అనుసంధానం, ఫ్యూచర్ సిటీలో AI నగరం, యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం జరుగుతోందన్నారు.

**హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు..**

ప్రపంచంలోనే గొప్ప ఈవెంట్లలో ఒకటిగా పేరుపొందిన మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నాయని, ఇంకా మరిన్ని ప్రపంచ ఈవెంట్‌లను తెలంగాణ ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్ కార్యాచరణ ద్వారా ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమం సమతుల్యంగా సాగుతోందన్నారు. ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో, హైదరాబాద్‌ను అత్యద్భుత నగరంగా మార్చడంలో అందరి సహకారం కోరుతున్నామన్నారు. హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసడర్లుగా మారాలని పిలుపిస్తూ.. మన విజయాలను ప్రపంచానికి చూపలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

# మహబూబాబాద్ సబ్ డివిజన్‌లో రౌడీషీట్ల తొలగింపు మేళా - 28 మంది రౌడీ షీటర్లపై రౌడీషీట్ ఎత్తివేత

## - మార్పు కోసమే ఈ ప్రయత్నం : డిఎస్పీ తిరుపతి రావు



**ఖమ్మం,మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** మహబూబాబాద్ డివిజన్ పరిధిలో సత్ప్రవర్తన కలిగిన ప్రశాంతవంతమైన జీవితం గడుపుతున్న 28 మంది రౌడీ షీటర్లపై రౌడీషీట్ ను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐ పి ఎస్ ఆదేశాలమేరకు తొలగించినట్లుగా డిఎస్పీ తిరుపతి రావు ప్రకటించారు. మహబూబాబాద్ డివిజన్ పరిధిలో సత్ప్రవర్తన కలిగిన వున్నవారిపై రౌడీ షీట్ల తొలగించపు మేళా మహబూబాబాద్ తోన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. ఇందులో ప్రశాంతమైన జీవితంతో పాటు ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలపాలలో పాల్గొకుండా సాధారణ జీవితాన్ని గడుపుతున్న రౌడీ షీటర్లను గుర్తించి వారిపై రౌడీ షీట్ తొలగించేందుకుగాను జిల్లా పరిధిలో రౌడీషీట్ల తొలగింపు మేళాను ఏర్పాటు చేశారు. అధికారులు నెల రోజుల పాటు కసరత్తు చేసి రౌడీషీట్ల తొలగించడం జరిగింది. దీనికోసం పరిధిలోని రౌడీషీటర్ల ప్రస్తుత జీవన విధానంపై సంబంధిత స్టేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో సమీక్షా జరిపి రౌడీషీట్ తొలగింపు జాబితాను రూపొందించారు. ఈ జాబితాను అనుసరించి సత్ప్రవర్తన కలిగిన వారిపై జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐ పి ఎస్ రౌడీ షీట్ తొలగింపు మేళా నిర్వహించారు. ఈ మేళాను ఉద్దేశించి మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతి రావు మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా సాధారణ జీవితం గడుపుతున్న వారిపై రౌడీ షీట్లను ఎత్తివేస్తున్నట్టు తెలిపారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీ షీట్లను ఎత్తి వేశామని ఎస్పీ తెలిపినట్లుగా డిఎస్పీ వివరించారు. ఎవరైనా నేరాలకు పాల్పడుతూ, ప్రజా జీవనానికి ఇబ్బంది కలిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీ షీట్లు తెరుస్తామని, అలాంటి వారిపై పోలీసుల నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇక గత కొద్దికాలంగా రౌడీషీటర్లుగా గుర్తింపబడిన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవితాన్ని కొనసాగిస్తూ ఎలాంటి నేరాలకు పాల్పడకపోవడాన్ని గుర్తించడం జరిగిందని అందుకే ఇలాంటి 28మంది పై రౌడీషీట్ తొలగింపు చేశామని చెప్పారు. రౌడీషీట్ తొలగించబడిన వ్యక్తులు భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ప్రశాంతవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. అలాగే ఏదైనా, ఎక్కడైనా నేరం జరిగితే పోలీసులకు సమాచారాన్ని అందించే భాధ్యాతయుతమైన పౌరులుగా వుంటూ పోలీసులకు అందించి సహకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా వీరిని చూసి మిగితా వారిలో కూడా మార్పు రావాలని రౌడీషీట్లను తొలగించాం అని అన్నారు. ముఖ్యంగా హింసతో ఏది సాధించలేమని, ప్రతికార చర్యలతో కాకుండా పరస్పరం చర్చించుకోని సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ దేవేందర్, డోర్నకల్ సీఐ రాజేష్, బయ్యారం సీఐ రవి, ఎస్.ఐ తిరుపతి, రూరల్ ఎస్.ఐ దీపిక, పి ఎస్ ఐ ఎస్ పాల్గొన్నారు.


# జోరుగా "విద్యార్థుల నమోదు డ్రైవ్'

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హై స్కూల్‌లో విద్యార్థులను చేర్పించడం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తోడ్పడాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం "ఎన్రోల్మెంట్ డ్రైవ్" జోరుగా నిర్వహించారు. తమ పాఠశాలలో అంకిత భావంతో కూడిన ఉన్నత విద్యార్హతలు గల సిబ్బంది ఉన్నారని, పట్టణంలో అధిక ఉత్తీర్ణత శాతంతో పాటు మండల స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిందని తెలుపుతూ ఇంటింట ప్రచారంతో ఆకట్టుకొన్నారు. ఈ ఏడాది తమ పాఠశాలలో వొకేషనల్, కంప్యూటర్ విద్యపై కూడా తర్ఫీదు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, యూనిఫాం, ఉచిత నోటు పుస్తకాలు, తల్లికి వందనం, స్కౌట్ అండ్ గైడ్స్ వంటి సౌకర్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉ



పాధ్యాయులు కేవివి సత్యనారాయణ, ఏఎల్‌వి కుమారి తదితరులు ఉన్నారు.

# భారత్ సైనికుల క్షేమం కోసం ప్రత్యేక పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** భారత్ పాకిస్తాన్ మద్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో భారత సైనికులకు ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు కలగాలని, దేశానికి మంచి కలగాలని, ప్రధాని మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సింధూర్ విజయం సాధిస్తూ దేశం బావుండాలని పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ ఆధ్వర్యంలో అభిషేక, అర్చన, కుంకుమ పూజ కార్య క్రమం నిర్వహించారు. దేశం కోసం ప్రతి పౌరుడు అండగా నిలవాలని రాష్ట్ర సంఘటన శక్తి కోసం అందరూ ప్రార్థించాలి కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటంరెడ్డి ఏడు కొండలు, కాళ్ల దుర్గాప్రసాద్, రాజేష్ నిమ్మగడ్డ సతీష్, వెజ్జు గణేష్, అల్లు ప్రసాద్, హిందూ ధర్మ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# పలు వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల









**గిద్దలూరు, (రాజధాని వార్తలు):** ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం, దొడ్డంపల్లె గ్రామంలో పల్లా సుధాకర్ రెడ్డి కుమారుని వివాహ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. తదుపరి ఉలాపు చంద్ర శేఖర్ మరియు లక్ష్మి లను ఆశీర్వధించారు. తదుపరి జొన్నలగడ్డ వెంకట సంపత్ కుమార్ మరియు సాయిగణితలకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# భారత ఆర్మీ రక్షణ కోసం చండీయాగం



**దాచేపల్లి, (రాజధాని వార్తలు):** దాచేపల్లి భక్త మహాశయులారా ! మన దాచేపల్లి శ్రీ వీర్ల అంకమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మన భారత్– పాక్ ల మధ్య కొనసాగుతున్న యుద్ధంలో భాగంగా భారత సైన్యానికి అత్యధిక బలం చేకూరాలని భారత సైన్యంలో ఎవరికి ఈ ప్రాణం నష్టం కలగకుండా ఉండాలని మన సైన్యానికి అఖండ బలం కలగాలని ఆ చండికాభవతిని ప్రార్థించడం కోసం ఆదివారం ఉదయం చండీయాగం చేస్తున్నాము. కనుక యావన్మంది ప్రజానీకం అంకమ్మ తల్లి ఆలయం చేరుకొని ఈ చండీయాగంలో పాల్గొని, మన దేశం కోసం ఆ అపరాజితా దేవిని ప్రార్థిద్దాం ఈ సందర్భంగా వేద పండితుల చేత గణపతి పూజ పుణ్యాహవాచనము చండీ పారాయణ చండీ హెూమము జరుగుతుంది. మనందరం కలిసి జయ జయ ధ్వానాలతో ఆ రణప్రియ శత్రుసంహారశక్తి దుష్టసంహారిణి అయినటువంటి ఆ దుర్గా చండికా భగవతిని పరమేశ్వరుని రామభద్రుని విజయ కారిని దేవిని ప్రార్థించి మనందరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందుదాం రండి.

అంకమ్మ తల్లి దేవస్థానము,
గ్రామ పెద్దలు, దాచేపల్లి.

# దేని కోసం, ఎవరి కోసం అందాల పోటీలు?

**- రైతుల సమస్యలు పరిష్కారం చూపకుండా ఇలాంటి కార్యక్రమాలేలా? - మిస్ వరల్డ్ పోటీలపై బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి - భారతదేశం - పాకిస్తాన్ యుద్ధంలో ఇదొకటి అందాల పోటీ తెలంగాణలో జర ఆలోచించండి ప్రజల్లారా**


**నారాయణపేట, (రాజధాని వార్తలు):** భారతదేశానికి శత్రు దేశం ఐన పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తుంటే ఇక్కడ తెలంగాణలో మాత్రం మిస్ వరల్డ్ (అందాల) పోటీలను నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి. నేటి నుండి హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ పోటీలపై మీడియా ద్వారా ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకవైపు తెలంగాణ లో విద్యార్థులు అనేక సమస్యలు, ఇబ్బందులు పడుతుంటే ఇంకోవైపు దేశంలో పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ముఖ్యమంత్రికి అందాల పోటీలు నిర్వహించాల్సిన అవసరం ఏంటని సూటిగా ప్రశ్నించారు. ఒకవైపు అభివృద్ధి కోసం నిధులు పుట్టడం లేదంటూనే మరోవైపు కోట్లు ఖర్చు చేసి అందాల పోటీలను నిర్వహించాల్సిన అవసరం ఎందుకని అన్నారు. అందాల పోటీల ద్వారా యువతకు, విద్యార్థులకు, ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారని మీడియా ద్వారా ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు భారతదేశంలో పాకిస్తాన్ యుద్ధంలో వీర జవాన్లు ఆర్మీలో వీర మరణం పొందుతుంటే ఈ తెలంగాణ రాష్ట్రానికి అందాల పోటీ కావాల్సి వచ్చిందా అంటూ హెద్దేవా చేశారు. ఒకవైపు ఆర్మీ జవాన్లు దేశం కోసం యుద్ధం చేస్తుంటే




ఈ తెలంగాణ రాష్ట్రంలో మిస్ వరల్డ్ అందాల పోటీలు పెట్టడం చాలా సిగ్గుచేటని రాష్ట్ర ప్రభుత్వంపై అగ్రహాం వ్యక్తం చేశారు. భారతదేశంలో ఏం జరుగుతుంది, రాష్ట్రంలో ఏం జరుగుతుంది తెలంగాణ ప్రజలారా ఇకనైనా ఆలోచించండి అని అన్నారు.

# తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు... ఒక్కరోజు ఆదాయం రూ. 3.16 లక్షలు





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ శృంగారవల్లభ స్వామి దేవస్థానము నకు శనివారం భక్తుల తాకిడి కలిగింది. శనివారం ఒక్కరోజు స్వామివారికి రూ. 3,16,011 ఆధాయం లభించింది. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకు న్నారు. ఉదయమే స్వామివారిని పుష్పాలతో అలంకరించి భక్తుల దర్శనానికి అనుమతించారు. కాగా ఆలయానికి ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 2,05,750, అన్నదాన విరాళములు ద్వారా రూ 76,031, కేశ ఖండన ద్వారా రూ.8,840 తులాభారం ద్వారా రూ. 700, లడ్డు ప్రసాదం ద్వారా 24,690 వెరశి రూ 3,16,011 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. కాగా దేవస్థానం తరుపున భక్తులకు ఉదయం పులిహెూర ప్రసాదం, ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే సుమారు 3వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, గ్రామ నాయకులు సహకారం అందించినట్టు ఆలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

# భారతదేశం అన్ని రంగాలలో విజయం సాధించాలని ప్రత్యేక పూజలు : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ ఎల్బీనగర్, (రాజధాని వార్తలు):** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి భారతదేశ సైనికులకు శక్తినివ్వాలని మరియు భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో విజయం సాధించాలని వారికి ఎలాంటి అడ్డంకులు రావద్దని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోత్సవాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పద్మారెడ్డి, దామోదర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ప్రదీప్ రెడ్డి, శంకరయ్య గౌడ్, శ్రీధర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, బిక్షపతి సేటు, కసిరెడ్డి, రాజు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మూర్తి, నరసింహారెడ్డి, నందకిషోర్, మహిపాల్ రెడ్డి, భద్రారెడ్డి, సురేష్ కుమార్, మహిళా సభ్యులు దేవిక, మాధవి, విజయ వై. జయంతి, లావణ్య నాయకులు భక్తులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నందమూరి 4వ తరం ఎన్టీఆర్.. లాంచ్‌లో ఎమోషనల్ మూమెంట్




తెలుగు సినీ చరిత్రలో ఎన్టీఆర్ ఫ్యామిలీ నుంచి మరో సర్ ప్రైజ్ రాబోతోంది. ఇప్పుడు నాలుగో తరం నందమూరి వారసుడి ఎంట్రీని చూడబోతున్నాం. నందమూరి హరికృష్ణ కుమారుడు, జానకీరామ్ తనయుడు ఎన్టీఆర్ ఇప్పుడు హీరోగా తెరపైకి రానున్నాడు. సోమవారం ఉదయం ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఈ చిత్రానికి గ్రాండ్‌గా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి కుటుంబం అంతా తరలివచ్చారు. నారా భువనేశ్వరి క్లాప్ కొట్టగా, నందమూరి మోహనకృష్ణ మొదటి షాట్‌కు దర్శకత్వం వహించారు. బాలకృష్ణ సతీమణి వసుంధర, దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి కుటుంబ సభ్యులు ఇలా పలువురు ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ అట్టహాస వేడుకలో కొత్త ఎన్టీఆర్ చెప్పిన మాటలు అందరి హృదయాల్ని తాకాయి. తన తొలి సినిమాలో మొదటి అడుగు పెడుతున్న సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ, “మా ముత్తాత నందమూరి తారకరామా రావు గారు, ఆయన పక్కనే నిలబడి చూసే మా తాత హరికృష్ణ గారు, అలాగే మా నాన్న జానకీరామ్ గారి ఆశీస్సులు ఎప్పటికీ నాతో ఉంటాయనే నమ్మకం నాలో ఉంది” అని అన్నారు. ఈ మాటలు వినగానే అక్కడి వారందరికీ ఓ భావోద్వేగం వెల్లివచ్చింది. మూడు తరాల వారసత్వాన్ని కళ్లముందు నిలిపినట్టయింది. అంతేకాదు, “ఈరోజు మా తాతలు, అమ్మమ్మలు, బాబాయిలు, మొత్తం కుటుంబం నన్ను ప్రోత్సహిస్తూ నాకు సపోర్ట్ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. నేను వేయబోయే ప్రతి అడుగుకూ వాళ్ల ఎంకరేజ్మెంట్ తోడై ఉంటుంది. ఇది నాకు చాలా స్పెషల్ మూమెంట్” అంటూ భావోద్వేగంగా తెలిపారు.

ఈ స్పష్టమైన అభిప్రాయాలు చూసి, ఈ తరం ఎన్టీఆర్‌లోనూ తన కుటుంబ విలువలు, సినీ గౌరవం పట్ల నిబద్ధత కనపడుతోంది. ఎన్టీఆర్ మొదటి సినిమాను ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి రూపొందిస్తున్నారు. సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్. కీరవాణి, రచయిత సాయిమాధవ్ బుర్రా వంటి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ ఈ సినిమాకు బలంగా నిలుస్తోంది. నాలుగో తరం ఎన్టీఆర్ తొలి అడుగుతోనే తనదైన గుర్తింపు తెచ్చుకుంటాడా అనే ఆసక్తి తెలుగు ప్రేక్షకులలో ఇప్పటికే మొదలైంది. మరి ఈ కుర్రాడు భవిష్యత్తులో ఇంకా ఎలాంటి సర్‌ప్రైజ్‌లు ఇస్తాడో చూడాలి.

# 2025 ఫస్టాఫ్‌లోని బెస్ట్ ఫిల్మ్స్ ఇవే..



నిన్న కాక మొన్న కొత్త సంవత్సరంలోకి ఎంటరైనట్టు ఉంది. కానీ అప్పుడే 2025 సగం అయిపోయింది. ఇండియన్ సినీ పరిశ్రమలు ఆల్రెడీ ఒకదాని తర్వాత మరొకటి బ్లాక్ బస్టర్లు అందించడానికి పోటీ పడుతుండగా, ఈ ఇయర్ ఇప్పటికే పలు సినిమాలు రిలీజయ్యాయి. అందులో కొన్ని క్రైమ్ థ్రిల్లర్లు, మరికొన్ని మర్డర్ మిస్టరీలు, ఇంకొన్ని కోర్టు రూమ్ డ్రామాలున్నాయి. 2025లో రిలీజై ఆడియన్స్ ను మెప్పించిన కొన్ని సర్‌ప్రైజింగ్ సినిమాల్లో టాప్ 5 సినిమా లేంటో చూద్దాం. అందులో మొదటిగా అక్షయ్ కుమార్ నటించిన బాలీవుడ్ మూవీ కేసరి2 ఫస్ట్ ప్లేస్‌లో ఉంది. దేశభక్తి ప్రధానమైన ఈ కోర్టు రూమ్ డ్రామా వరల్డ్ వైడ్‌గా రూ. 129.14 కోట్లు కలెక్ట్ చేసి ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంది. ఇండియన్ హిస్టరీ మరియు ఎమోషన్స్ ను కలగలిపి తెరకెక్కించిన ఈ సినిమా ఆడియన్స్ ను విపరీతంగా అలరించింది. టాలీవుడ్నుంచి వచ్చిన కోర్టు: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ. నేచురల్ స్టార్ నాని నిర్మాతగా ప్రియదర్శి ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ కోర్టు రూమ్ డ్రామా ఆడియన్స్ ను విపరీతంగా మెప్పించింది. అంతేకాదు తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.58.15 కోట్లు కలెక్ట్ చేసి నిర్మాతకు, డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాల్ని మిగిల్చింది. కోలీవుడ్ నుంచి వచ్చిన టూరిస్ట్ ఫ్యామిలీ సినిమా కూడా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. కొత్త జీవితాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నించే వలస కుటుంబం యొక్క కథగా ఈ సినిమా రూపొందింది. ఫన్నీ ఫ్యామిలీ డ్రామాగా శశి కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా రూ.25 కోట్లు కలెక్ట్ చేసి మంచి హిట్ గా నిలిచింది. ఇక మలయాళ ఇండస్ట్రీ నుంచి రీసెంట్‌గా వచ్చిన తుదరమ్ సినిమా కూడా ఎమోషనల్ రోలర్ కోస్టర్‌గా తెరకెక్కి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ ను తెచ్చుకుంది. మోహన్ లాల్ హీరోగా వచ్చిన ఈ సినిమా రూ.175 కోట్లు కలెక్ట్ చేసి సూపర్ హిట్‌గా నిలిచింది. ఇక క్రైమ్ సినిమాలను ఇష్టపడే వారు కన్నడ సినిమా అజ్ఞాతవాసిని తప్పకుండా చూడాల్సిందే. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ఎన్నో సీక్రెట్స్, ఎవరూ ఊహించని ట్విస్టులతో మంచి స్క్రీన్ ప్లేతో ప్రతీ ఒక్కరినీ అలరిస్తుంది. ఈ సినిమాలన్నీ చిన్న బడ్జెట్‌తో రూపొందినవే. సినిమా హిట్ అవాలంటే దానికి ముఖ్యం బడ్జెట్ కాదని, ఆడియన్స్ కథకు కనెక్ట్ అయితే చాలని ఈ సినిమాలన్నీ నిరూపించాయి. మొత్తానికి 2025 ఫస్టాఫ్ చాలా బాగా స్టార్ట్ అయింది. మరి 2025 సెకండాఫ్‌లో ఎలాంటి మంచి సినిమాలు రానున్నాయో చూడాలి.

# చిక్కుల్లో ‘డ్యూడ్’.. మైత్రీకి కొత్త తలనొప్పి!



కొద్ది రోజుల క్రితం ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రదీప్ రంగనాథ్‌తో ఓ సినిమాని అనౌన్స్ చేసింది. తాజాగా ఈ సినిమాకు ‘డ్యూడ్’ అనే టైటిల్‌ను కన్ఫార్మ్ చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. దీపావళి కానుకగా మూవీని రిలీజ్ చేస్తామని కూడా తెలిపారు. రొమాంటిక్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఈ చిత్రానికి కీర్తిశ్వరన్ డైరెక్టర్ కాగా.. ‘ప్రేమలు’ ఫేమ్ మమిత బైజు హీరోయిన్ గా ఎంపిక అయింది. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు. అంతా బాగానే జరుగుతున్న సమయంలో డ్యూడ్ టైటిల్ చిక్కుల్లో పడింది. దాంతో మైత్రీకి కొత్త తలనొప్పి మొదలైంది. మైత్రి మూవీ మేకర్స్ వారు టైటిల్ ప్రకటన చేసిన వెంటనే.. డ్యూడ్ టైటిల్ తమదంటూ యువ హీరో-డైరెక్టర్-ప్రొడ్యూసర్ తేజ్ తెరపైకి వచ్చాడు.

ఏడాది క్రితమే ‘డ్యూడ్’ టైటిల్‌ను తమ సినిమా కోసం రిజిస్టర్ చేశామని.. అదే టైటిల్‌తో సినిమాను ప్రచారం కూడా చేస్తున్నామని తేజ్ తెలిపాడు. ఇప్పుడు ఆ పేరునే మైత్రి వారు అనౌన్స్ చేయడం ఆశ్చర్యంగా, ఆవేదనగా ఉందన్నాడు తేజ్. అయితే మైత్రి వంటి బడా నిర్మాణ సంస్థతో ఘర్షన పడే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని.. ఆల్రెడీ ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లానని, సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామని తేజ్ పేర్కొన్నాడు. తేజ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రమే ‘డ్యూడ్’. స్క్రీన్ ప్లే కూడా అతనే అందిస్తున్నాడు. ఫుట్ బాల్ నేపథ్య కథతో రూపుదిద్దుకుంటున్న చిత్రమిది. రంగాయన రఘు ఇందులో ఫుట్ బాల్ కోచ్‌గా కనిపించబోతున్నారు. రాఘవేంద్ర రాజ్‌కుమార్, శాన్య కావేరమ్మ, మేఘ, మోహిత, అనర్ఘ్య, దీపాలి పాండే తదితరులు ఇతర ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే సినిమాకు సంబంధించి కొన్ని పోస్టర్స్ బయటకు వచ్చాయి. చిత్రీకరణ దాదాపు ఆఖరి దశకు చేరుకుంది. లాస్ట్ షెడ్యూల్ ఒక్కటే బ్యాలెన్స్. ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో ఈ చిత్రాన్ని తెలుగులోనే కాకుండా కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయాలని డ్యూడ్ మేకర్స్ భావిస్తున్నారు. అయితే ఇంతలోనే ప్రదీప్ రంగనాథ్‌తో తీయబోయే చిత్రానికి మైత్రి మూవీ మేకర్స్ వారు డ్యూడ్ టైటిల్ కన్ఫార్మ్ చేస్తూ పోస్టర్ ను రిలీజ్ చేశారు. దాంతో ఒరిజినల్ డ్యూడ్ వారు ఉలిక్కి పడ్డారు. టైటిల్ తమదంటూ ముందుకు వచ్చారు. మరి ఈ ఇష్యూపై మైత్రీ వారు ఎలా రియాక్ట్ అవుతారో.. ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో.. చూడాలి.

# ఆయనతో అదిరిపోయే సినిమా చేస్తా



ప్రస్తుతం టాలీవుడ్‌లో మల్టీస్టారర్ల ట్రెండ్ నడుస్తోంది. ఏదైనా సినిమా గురించి ఆడియన్స్ మాట్లాడుకోవాలంటే సంథింగ్ స్పెషల్ ఉండాలి. అలాంటిది ఇండస్ట్రీలో ఏదైనా మల్టీస్టారర్ వస్తుందంటే దానికి అన్నింటికంటే ఇంకాస్త ఎక్కువ క్రేజ్ ఉంటుంది. ఆ క్రేజ్ కు కాస్త మంచి కంటెంట్ తోడైతే ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఖాయం. అలనాటి కాలంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ కలిసి దేవుడు చేసిన మనుషులు చేశారు. ఆ తర్వాత కృష్ణ- శోభన్ బాబు కలిసి ఎన్నో సినిమాలు చేశారు. కానీ ఆ తర్వాత జనరేషన్‌లో వచ్చిన స్టార్లు మల్టీస్టారర్ సినిమాలు కాస్త తక్కువే చేశారు. 2013లో వెంకటేష్ సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాను మహేష్ బాబుతో కలిసి చేసి ఈ మల్టీస్టారర్ ట్రెండ్‌ను మొదలుపెట్టాడు. ఆ సినిమాతో బ్లాక్ బస్టర్‌ను అందుకున్న వెంకీ తర్వాత పవన్ కళ్యాణ్‌తో కలిసి గోపాల గోపాల చేశాడు. ఆ తర్వాత కూడా వెంకీ పలువురితో కలిసి మల్టీస్టారర్లు చేశాడు. ఇప్పుడు త్వరలో వెంకీ ఓ యంగ్ హీరోతో కలిసి సినిమా చేస్తున్నట్టు సమాచారం. అయితే ఆ యంగ్ హీరో ఎవరో కాదు, టాలీవుడ్ టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు. రీసెంట్‌గా సింగిల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన శ్రీవిష్ణు వెంకటేష్‌కు వీరాభిమాని అనే విషయం తెలిసిందే. సింగిల్ సినిమా ప్రమోషన్స్‌లో శ్రీ విష్ణు ఓ ఇంటర్వ్యూలో వెంకీతో తాను తప్పకుండా సినిమా చేస్తానని చెప్పాడు. రామ్ అబ్బరాజు మైత్రీ బ్యానర్‌లో ఓ సినిమా చేయడానికి కథను రెడీ చేస్తున్నాడని, ఫస్టాఫ్ ఆల్రెడీ అయిపోయిందని, కథ పూర్తయ్యాక ఆయన్ని అప్రోచ్ అవుతామని, ఆయనకు కథ చెప్తే తప్పకుండా సినిమా చేస్తారనే నమ్మకం తనకుందని, అన్నీ కుదిరితే ఆ సినిమాను వెంకీతో చేస్తానని, ఒకవేళ ఆ సినిమా కాకపోయినా మరో సినిమా అయినా చేస్తానని, ఒక ఫ్యాన్‌గా ఆయన్ని ఎలా చూడాలో తనకు బాగా తెలుసని, తమ కాంబోలో వచ్చే సినిమా నెక్ట్స్ లెవెల్‌లో ఉంటుందని శ్రీవిష్ణు వెల్లడించాడు.

# అయ్యన్న క్రికెట్ లీగ్ ప్రారంభించిన తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ



**నాతవరం, (రాజధాని వార్తలు):** మండల కేంద్రమైన నాతవరం శ్రీశ్రీశ్రీ కోటమ్మ తల్లి పండుగ సందర్భంగా విజయ్ & రాజేష్ యూత్ ఆధ్వర్యంలో అయ్యన్న క్రికెట్ లీగ్ ప్రారంభించిన తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో మొత్తం 30 టీంలు పాల్గొంటున్నాయని, క్రికెట్‌లో గెలిచిన టీమ్‌లకు మొదటి బహుమతిగా 25,000 రెండవ బహుమతిగా 15000, బెస్ట్ ప్లేయర్ 3000 రూపాయలు బహుమతులు ఇస్తున్నామని, క్రికెట్ ఆడే టీమ్‌లకు మంచినీళ్ళు అందుబాటులో ఉండేలాగా టోర్నమెంట్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ నేతల విజయ్ కుమార్,తాండవ డిసి మెంబర్ పారుపల్లి దాసు,మాజీ పిఏసిఎస్ అధ్యక్షుడు శెట్టి సత్యనారాయణ, యర్రా కాశీ, మాజీ ఎంపీటీసీ బంగారు సూరిబాబు, మండల ఐ.టిడిపి ఇన్‌ఛార్జ్ శెట్టి గోపి, మండల తెలుగు యువత అధ్యక్షుడు శెట్టి లోవ, గ్రామ పార్టీ అధ్యక్షుడు పైల సూరిబాబు, ఉపాధ్యక్షుడు అపిరెడ్డి కొండబాబు గ్రామ నాయకులు అంకంరెడ్డి వరహాలదొర, జీవిరెడ్డి రాజుబాబు, అంకం రెడ్డి యర్రా పాత్రుడు, శెట్టి నాయుడు, పినిరెడ్డి పండు అంకంరెడ్డి కొండబాబు, అంకంరెడ్డి శివ, చిటికెల రాజుబాబు, చింతకాయల శ్రీను, వివిధ పంచాయతీ యువ నాయకులు పోలు పర్తి సాయి, గొంప చిట్టిబాబు, తానారి దాసు, కశింకోట గోవింద్, నాతవరం గ్రామ యూత్ సభ్యులు పినిరెడ్డి శ్రీను, శెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహం బహిరంగ హత్యకు దారి తీసింది - ఇద్దరు బావమర్ధులు మృతి



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి క్యాంపులో సోమవారం ఉదయం హింసాత్మక ఘటన చోటు చేసుకుంది. కుటుంబ కలహం క్షణాల్లోనే రక్తపాతానికి దారి తీయడంతో ఇద్దరు బావమర్ధులు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చింతపల్లి క్యాంపులో నివసిస్తున్న గెన్ను ఇంట్లో కుటుంబ కలహం తలెత్తింది. అంతకుముందు బంధువుల అంత్యక్రియల నిమిత్తం కిముడు కృష్ణ, కిముడు రాజు అనే అన్నదమ్ములు అక్కడికి వచ్చారు. అనంతరం మద్యం సేవించిన వారు ఇంటికి తిరిగొచ్చిన సమయంలో గెన్ను తన భార్యతో ఘర్షణకు దిగాడు. ఈ దృశ్యాన్ని చూసిన కృష్ణ, రాజు 'అక్కను ఎందుకు కొడుతున్నావు?' అంటూ గెన్నును మందలించగా, ఆగ్రహించిన గెన్ను బరిసె తోల్లి ఇద్దరిపై తీవ్రంగా దాడి చేశాడు. దాడిలో కృష్ణ, రాజులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారిని ఆపేందుకు ప్రయత్నించిన మరో వ్యక్తి రాజు తీవ్రంగా గాయపడ్డాడు. గాయాలపాలైన రాజును విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో విషాదం నెలకొంది.

# పి.జి.ఆర్.ఎస్. అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోవాలి : ఇన్‌చార్జి జిల్లా కలెక్టరు ఎమ్. జాహ్నవి





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని, అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టరు మరియు జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా కలెక్టరు మరియు జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, హౌసింగు పి.డి. వై.శ్రీనివాస రావు, ఎస్.డి.సి. ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో ప్రజల నుండి తీసుకున్న అర్జీల పరిష్కారం గూర్చి సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. పి.జి.ఆర్.ఎస్. పెండింగు అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ పెండింగు అర్జీలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.

అర్జీలు పెండింగు లేకుండా సకాలంలో పరిష్కరించాలని, అర్జీలో తెలిపిన సమస్యకు సంబంధించి వివరణ స్పష్టంగా తెలపాలని, అర్జీదారునికి సమస్య పరిష్కారం గూర్చి అర్థమయ్యే విధంగా తెలియజేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మన్యంలో మింగుతున్న చీకటి విద్య - పాఠశాలల్లో జీరో ఫలితాలు

**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** మన్యంలో విద్యా రంగం దిగజారుడు బాట పట్టింది. పదవ తరగతి ఫలితాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పలు పాఠశాలలు జీరో పర్సంటేజ్ నమోదు చేయడం దీనికి నిదర్శనం. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల అలసత్వం విద్యా ప్రమాణాల పతనానికి కారణమవుతున్నాయి. మండలానికి అతిదూర ప్రాంతాలైన దారకొండ, జర్రెల, అప్పర్ సీలేరు, దుంబ్రిగుడ ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. బందవీధి బాలికల పాఠశాలలో 66 మందిలో ఒక్కరు మాత్రమే ఉత్తీర్ణత సాధించగా, పెదవలస, లంబసింగి, జి.మాడుగుల, నుర్మతి, బొర్రా, బొడ్డపుట్టు బాలుర పాఠశాలల్లో ఫలితాలు మరింత దిగజారాయి. అంతేకాకుండా, కొంతమంది ఉపాధ్యాయులు విధులకు హాజరు కాక, గ్రామస్థులను వాలంటీర్లుగా నియమించి తరగతులను నడిపిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై అధికారులు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదే సమయంలో రేపటి నుంచి ప్రారంభమయ్యే సప్లిమెంటరీ పరీక్షలను దళారులు తమ లబ్ధి కోసం వాడుకునే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షల పేరిట ఫిక్స్డ్ రేట్లకు 'సేవలు' అందిస్తున్నారని ప్రచారం జోరందుకుంది. ఈ పరిస్థితులు విద్యా రంగాన్ని దళారుల లాభాల కేంద్రంగా మారుస్తున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు మేలుకుని విద్యా ప్రమాణాల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.






# డిప్యుటేషన్‌పై పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అదనపు సమన్వయకర్త, సమగ్ర శిక్ష కార్యాలయం, అనకాపల్లి కార్యాలయంలో సెక్టోరల్ మరియు అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులలో ఫారిన్ సర్వీస్‌లో మరియు డిప్యుటేషన్‌పై పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు అదనపు పథక సమన్వయకర్త ఆర్. జయప్రకాష్ తెలియజేసారు. సోమవారం ఒక ప్రకటన విడుదలచేస్తూ అదనపు సమన్వయకర్త, సమగ్ర శిక్ష కార్యాలయం, అనకాపల్లి కార్యాలయంలో అయిదు సెక్టోరల్ మరియు అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులలో (కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసరు, అకడమిక్ మోనటరింగు అధికారి, బాలికల అభివృద్ధి అధికారి, అసిస్టెంటు ప్రోగ్రాం అధికారి, అసిస్టెంటు జిసిడిఒ) ఫారిన్ సర్వీస్‌లో మరియు డిప్యుటేషన్‌పై పనిచేయుటకు గాను 55 సంవత్సరములు దాటని ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు తేది. 12.05.2025 నుండి 19.05.2025 సాయంత్రం 05.00 వరకు ఈ కార్యాలయములో స్వీకరించబడునని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరములు మరియు దరఖాస్తు నమూన apssakp.com మరియు అదనపు సమన్వయకర్త, సమగ్ర శిక్ష కార్యాలయం, అనకాపల్లి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తులను సంబందిత అధికారి సంబంధిత మండల విద్యాశాఖాధికారి లేదా ప్రధానోపాధ్యాయుల ద్వారా కార్యాలయానికి గడువు తేదీలోగా అందజేయాలని అదనపు సమన్వయకర్త తెలియజేసారు.



# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి..దేశవ్యాప్తంగా కార్మిక సమ్మెను జయప్రదం చేయండి



**బుచ్చయ్య పేట, (రాజధాని వార్తలు):** లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మే 20వ తేదీన 2025 తే"న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, స్కీం వర్కర్స్ అసంఘటిక రంగం కార్మికులు, పంచాయతీ వర్కర్స్ సమస్యల పరిష్కారం కొరకు సోమవారం బుచ్చయ్యపేట మండలంలో పంచాయతీ కార్మికులు ఈనెల 20వ తేదీన సమ్మెకు వెళుతున్నామని ఆరోజు విధులకు వెళ్ళకుండా మండలంలో ఉన్న పంచాయతీ వర్కర్స్ అందరూ 108 సమ్మెలో పాల్గొంటారని సమ్మె నోటీస్ ఎండిఓకి ఈ ఓ ఆర్ డి ఓకి అందజేయడం జరిగిందని పంచాయతీ కార్మికులు కనీసం వేతనాలు అమలు చేయాలని పిఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డులు రిటైర్మెంట్ బెనిఫిట్, ఆరోగ్య భీమా సదుపాయం కల్పించాలని పంచాయితీ కార్మికుల యూనిఫామ్, సబ్బులు, నూనెలు, పనిముట్టి పరికరాలు ఇవ్వాలని మే 20వ తేదీని జరుగుతున్న సమ్మెలో బుచ్చియ్యపేట మండలంలో 35 పంచాయతీలు నుంచి 108 మంది పంచాయతీ కార్మికులు వారి యొక్క సమస్యల పాల్గొంటామని మండలంలో బుచ్చయ్యపేట మండలంలో సమ్మె నోటీసు ఇచ్చామని సిఐటి నాయకులు ఎస్ వి నాయుడు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాజబాబు, సింహాద్రి, శ్రీను, ముత్యాలు యేసురాజు, లావలు ఈరోజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీ లలితాదేవి వార్షికోత్సవం అన్న సమారాధన



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** శ్రీశ్రీశ్రీ లలితా దేవి 14వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని శ్రీశ్రీశ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం చైర్మన్ పీలా నాగ శీను మరియు శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ ఇరువురు కలిసి భక్తులకు అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కన్వీనర్ బుద్ధ కుమార్ సదరం వెంకటరావు బుద్ధ సత్యనారాయణ బొడ్డేడ రమణ తదితరులు పాల్గొన్నారు.

# 84వ డివిజన్ టిడిపి సంస్థాగత ఎన్నికలు : మాదంశెట్టి నీలబాబు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు 84వ డివిజన్‌లో ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు జరిగిన సమావేశంలో ఎన్నికల నిర్వహకులు బొలిశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన సమావేశంలో 2025-27 సంవత్సరాలకు పార్టీ కమిటీని ఈరోజు ఉదయం రైస్ మర్చంట్ అసోసియేషన్ ఆఫీసులో జరిగిన సమావేశంలో బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వైసిపి అమరావతిపై సంక్షేమ పథకాలపై దుష్ప్రచారం చేసిందని వీటిని తిప్పికొట్టే బాధ్యత కమిటీ సభ్యులు నిరంతరం వార్డులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వ కార్యక్రమాలు సంక్షేమ పథకాలు ప్రజల ముందుకు తీసుకువెళ్లాలని రోడ్లు కాలువలు బిల్డింగులు నిర్మాణ పనులు పర్యవేక్షణ చూస్తూ ఉండాలని అవినీతి అక్రమాలకు తావు లేకుండా వార్డు పరిధిలో జరుగుతున్న అక్రమ కార్యక్రమాలు పార్టీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకునే విధంగా పార్టీ శ్రేణులు ముందుండాలని శ్రీనివాసరావు పార్టీ శ్రేణులను కోరారు. అనంతరం 11 మంది సభ్యులతో కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సిరసపల్లి సన్యాసిరావు, కుప్పిలి జగన్, బోడి వెంకట్రావు, బోయిన మురళి, తలారి ప్రసాదు, వానపల్లి పాపారావు, సాలపు మోహన్, తదితరులు పాల్గొన్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan